
# పేరుకే ధాన్యం కేంద్రాలు

- రైతుల నుంచి వడ్లను కొనడమే లేదు
- అన్నదాతలను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్
- బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

మంచాల, నవంబర్ 25 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని ఆరుట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం పేరుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఆరోపించారు. రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో నిత్యం వారు వడ్ల కుప్పల వద్దే పడిగాపులు కాస్తున్నారన్నారు. బోడకొండ, మంచాల, లోయపల్లి గ్రామాల్లో పౌరసఫరాల శాఖ, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల నుంచి ఇప్పటి వరకు రెండు లారీల లోడ్ల వడ్లను మాత్రమే తరలించారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ హయాంలో నియోజకవర్గంలో 20 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొంటే.. కాంగ్రెస్ ప్రభుత్వంలో 10 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయడంలేదని ఎద్దేవా చేశారు. కొన్న ధాన్యానికి ఇప్పటివరకు డబ్బులను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయకపోవడంతో వారు అధికారుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. అదేవిధంగా రెండు లక్షల్లోపు రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించిన రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు 40 శాతం మందికి కూడా చేయలేదన్నారు. రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేయకపోవడం తగదన్నారు. కలెక్టర్, పౌరసరఫరా శాఖ అధికారులు వెంటనే సమావేశం ఏర్పాటు చేసుకుని కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం కొనేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు చీరాల రమేశ్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, నాయకులు రమేశ్ గౌడ్, సుకన్య, రవి, రఘుపతి, రాము, జంగయ్య, జంగయ్య, బుగ్గరాములు, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆరుట్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి





ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు నారాయణరెడ్డి, ప్రతీక్ జైన్

## ప్రజావాణి దరఖాస్తులను వారం రోజుల్లో పరిష్కరించాలి

- రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి
- అర్జీలను సత్వరమే పరిష్కరించాలి
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

ఆదిబట్ల, నవంబర్ 25 : ప్రజావాణి దరఖాస్తులను వారం రోజుల్లోగా పరిష్కరించాలని, రెవెన్యూ సమస్యలపై వచ్చే నెల 9న సమీక్ష ఉంటుందని రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ప్రజావాణిలో పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం అర్జీలు 52 రాగా.. అందులో రెవెన్యూశాఖకు చెందినవి 42, వివిధ శాఖలకు చెందినవి 10 ఉన్నాయని.. వాటిని వారం రోజుల్లోగా పరిష్కరించాలన్నారు.

### సర్వే డాటాను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి

సమగ్ర కుటుంబ సర్వే డాటాను వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా , మండలాలు, మున్సిపాలిటీల అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన అధికారులతో మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేటప్పుడు తప్పులేకుండా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సర్వేను ఈ నెల 30 వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. డాటా ఎంట్రీని ఎక్స్‌పర్ట్ టీమ్ చెక్ చేసిన తర్వాతే ఆన్‌లైన్ చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు అందిస్తున్న ఫలహారం, ఇతర సౌకర్యాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. వసతి గృహాల్లో భోజనం విషయంలో నిర్లక్ష్యం చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఆర్వో సంగీత, వివిధ విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : ప్రతీక్ జైన్

వికారాబాద్ : ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో జరిగిన ప్రజావాణిలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. మొత్తం 113 దరఖాస్తులు రాగా.. వాటిని సంబంధిత విభాగాల అధికారులకు పంపించి త్వరగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీకలెక్టర్ ఉమాహారతి, ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## తప్పుల్లేకుండా ఎంట్రీ చేయాలి

### వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్

పూడూరు, నవంబర్ 25 : సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీని ఎలాంటి తప్పు ల్లేకుండా చేపట్టాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులకు సూ చించారు. సోమవారం మండల కేంద్రంలో కొనసాగుతున్న సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవోతో మాట్లాడుతూ డాటాను ఎంట్రీ చేసేటప్పుడు ఎన్యూమరేటర్ తప్పని సరిగా దగ్గర ఉండి నమోదు చేయించాలన్నారు. ప్రతి కుటుంబ వివరాలను క్షుణంగా పరిశీలించి తప్పుల్లేకుం డా చేపట్టాలన్నారు.

ఆన్‌లైన్ ఎంట్రీ పూర్తై స్ట్రాంగ్ రూమ్‌లో బాక్స్‌ల్లో భద్రపరిచిన వాటిని పరిశీలించారు. ఆయన వెంట (డీపీవో) మండల ప్రత్యేకాధికారిణి జయసుధ, ఎంపీడీవో పాండు, అధికారులు ఉన్నారు.



పూడూరు మండలంలో సర్వే ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించి మాట్లాడుతున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

## మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి

### సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్

కొడంగల్, నవంబర్ 25 : విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంపై టీచర్లు ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలని.. రోజువారీ మెనూను తప్పనిసరిగ్గా పాటించాలని సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సూచించారు. సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, జీసీపీఎస్ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీ లించారు. ఈ సందర్భంగా ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. బియ్యంతోపాటు సరుకులు నాణ్యతగా ఉండేలా చూడాల న్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎంఈవో రాంరెడ్డికి సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## గిరి ప్రదక్షిణకు విశేష స్పందన

వికారాబాద్, నవంబర్ 25 : హిందూ జనశక్తి, మాణిక్‌ప్రభు సంస్థాన్ సంయుక్తాధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అనంతగిరి ప్రదక్షిణకు విశేష స్పందన వచ్చింది. భక్తులు వేలాదిగా తరలివచ్చారు. మాణిక్ ప్రభు సంస్థాన్ బాలమార్తాండ మహారాజ్, అనంతగిరి పరిరక్షణ సమితి సభ్యులు, హిందూ జనశక్తి నాయకులతో ఈ గిరిప్రదక్షిణ ఉదయం 5 గంటలకు రాజీవ్‌నగర్‌లోని భవానీమాత ఆలయం నుంచి ప్రారంభమై మేకలగండి నుంచి శుభం ఫంక్షన్ హాల్, గోధుమగూడ మీదుగా జైదుపల్లి, కేరెళ్లి సత్యసాయి కేంద్రం వరకు చేరుకున్నది. అక్కడి నుంచి భక్తుల భజనల మధ్య బుగ్గ రామలింగేశ్వరాలయం, బండబావి హనుమాన్ ఆలయం మీదుగా అనంత పద్మనాభ స్వామి ఆలయానికి చేరుకుని ముగిసింది. ఈ గిరి ప్రదక్షిణలో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, హిందూ జనశక్తి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, హిందూ జనశక్తి రంగారెడ్డి జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ మాధవరెడ్డి, అనంతగిరి పరిరక్షణ సమితి సభ్యులు నర్సింహులు, అంజిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నరోత్తంరెడ్డి , రాజశేఖర్, శివరాజ్, యాదగిరి, మోహన్‌రెడ్డి, విజయలక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.



గిరిప్రదక్షిణలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

## సమస్యలు పరిష్కరించాలి

### వికారాబాద్ కలెక్టర్‌కు ఎంసీపీఐ(యూ) వినతి

వికారాబాద్, నవంబర్ 25 : రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలు, జిల్లాలోని సమస్యలను పరిష్కరించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ సభ్యులు సోమవారం కలెక్టరేట్‌లో వికారాబాద్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఆరు గ్యారెంటీల్లో ఇంకా అమలు కాని హామీల్లో మహిళలకు ప్రతినెలా రూ. 2,500 ఇవ్వాలని, వితంతులకు రూ.4,000, దివ్యాంగులకు రూ.ఆరు వేల పింఛన్ చెల్లించాలన్నారు. రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని, పత్తి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. రెండు లక్షల్లోపు పంట రుణాలను ఎలాంటి ఆంక్షలు లేకుండా మిగిలిన రైతులందరికీ మాఫీ చేయాలని.. లగచర్ల పరిసర ప్రాంతాల్లో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం పోలీస్ క్యాంపులను వెంటనే ఎత్తివేసి ఆ ప్రాంతవాసులు, గిరిజనులను భయభ్రాంతుల నుంచి కాపాడాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎంసీపీఐ (యూ) వికారాబాద్ జిల్లా కమిటీ సభ్యులు సంగమ్మ, నర్సింహులు, రుప్లానాయక్, అనంతమ్మ తదితరులు ఉన్నారు.

# భక్తితో దర్శించి.. స్వామిని స్మరించి..

- వైభవంగా సాగుతున్న బుగ్గ రామలింగేశ్వరుడి జాతర
- చివరి కార్తిక సోమవారం కావడంతో ఆలయానికి భక్తుల తాకిడి
- కార్తిక దీపాలు వెలిగించిన మహిళలు

మంచాల, నవంబర్ 25 : మండలంలోని ఆరుట్ల గ్రామ సమీపంలో ఉన్న బుగ్గ రామలింగశ్వరస్వామి జాతర వైభవంగా కొనసాగుతున్నది. చివరి కార్తిక సోమవారం కావడంతో భక్తులు అధికంగా తరలివచ్చారు. ఉదయం నుంచే ఆలయం భక్తజన సంద్రంగా మారింది. దేవాలయంలో ఉన్న గుండంలో భక్తులు కుటుంబ సమేతంగా స్నానాలు ఆచరించి స్వామి వారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. మహిళలు ఆలయ ఆవరణలో కార్తిక దీపాలను వెలిగించారు. అనంతరం చెట్ల కింద కుటుంబ సమ్మేతంగా వనభోజనాలు చేశారు. అనంతరం భక్తులు పిల్లలతో కలిసి ఆట వస్తువులు, స్వీట్లు కొనుగోలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఇబ్రహీంపట్నం నుంచి బుగ్గ రామలింగేశ్వరాలయం వరకు ఆర్టీసీ 10 నిమిషాలకొక బస్సును నడిపింది.

### స్వామివారి సేవలో కిషన్ రెడ్డి దంపతులు..

బుగ్గ రామలింగేశ్వరస్వామిని ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆయన సతీమణి ముకుందమ్మ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ కమి టీ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ .. కాశీ తర్వాత మరో అతి పెద్దది రామలింగేశ్వరాలయం అని అన్నారు. అనంతరం కిషన్‌రెడ్డి ఆలయ పరిసరాల్లో నడుచుకుంటూ వెళ్లి భక్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటరమణారెడ్డి, లక్ష్మారెడ్డి, ఇందిర, సుకన్య, కృపేశ్, రాము, జగదీశ్, రఘుపతి, జంగారెడ్డి, రాజు పాల్గొన్నారు.



జన సందోహంగా మారిన బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం



సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించిన భక్తులు

## ప్రజలకు వేసెక్టమీపై అవగాహన కల్పించాలి



వేసెక్టమీ ఆపరేషన్లకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేస్తున్న వికారాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ


### వికారాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

వికారాబాద్, నవంబర్ 25 : ప్రజలకు వేసెక్టమీపై అవగాహన కల్పించడంతోపాటు ఆపరేషన్లకు ప్రోత్సహించేందుకు ఈ నెల 21 నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకు వేసెక్టమీ పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు వికారాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ తెలిపారు. సోమవారం వికారాబాద్ డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, సూపర్‌వైజర్లతో వేసెక్టమీ ఫోర్ట్‌నైట్–2024పై సమీక్ష నిర్వహించి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసెక్టమీ ఆపరేషన్లు చేయించుకునేందుకు ముందుకొచ్చే వారిని గుర్తించి డిసెంబర్ 4వ తేదీ లోపు వికారాబాద్ జిల్లా ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయించాలన్నారు. ప్రతి పీహెచ్‌సీ నుంచి కనీసం ఒక్క కేసు అయినా వచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మాతా,శిశు సంరక్షణ సేవలు 100% ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, వచ్చే వారం నుంచి జిల్లాలో ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ పవిత్ర, ఎన్‌క్యూఏఎస్ ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ నేహా, స్టాటిస్టికల్ ఆఫీసర్ నాగమల్లేశ్వర రావు, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ రజిత, అన్ని పీహెచ్‌సీల వైద్యులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

## రైతులను వెంటనే విడుదల చేయాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు విజ్ఞప్తి చేసిన భరత్ ముక్తి మోర్చా నాయకులు

పరిగిలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన ప్రజాసంఘాల నాయకులు



కులకచర్ల/పరిగి, నవంబర్ 25: లగచర్లకు వెళ్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు రాంబాబునాయక్, డీబీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌లను పరిగి పాల శీతలీకరణ కేంద్రంలో సోమవారం భారత ముక్తి మోర్చా సామాజిక ప్రజాసంఘాల నాయకులు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. లగచర్లతోపాటు పలు గ్రామాల రైతులు తమ భూములను ఫార్మావిలేజ్ ఏర్పాటుకు ఇవ్వబోమని ప్రభుత్వానికి స్పష్టం చేసినా.. సర్కారు మొండిగా వ్యవహరించి డ్రోన్ల ద్వారా సర్వే చేయించిందన్నారు. ఈ నెల 11న లగచర్లలో రైతులు, గిరిజనులు తమ భూములు ఫార్మా కంపెనీలకు పోతాయనే ఆవేదన, భయంతోనే అధికారులను అడ్డుకున్నారని..అంతేకాని వారిపై కావాలని దాడి చేయలేదన్నారు. ప్రభుత్వం పోలీసులతో రైతులు, గిరిజనులను అక్రమంగా అరెస్టు చేయించి వారిపై కేసులు పెట్టడం తగదన్నారు. అరెస్టైన వారు వెంటనే బయటికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని బక్కి వెంకటయ్యకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్, వివిధ సంఘాల నాయకులు, బీఎంపీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్, జేఏసీ చైర్మన్ నాగేశ్వర్, ఎంబీపీ జిల్లా ఉపాధ్యక్షుడు హరినాయక్, దోమ మండల కార్యదర్శి గణేశ్‌నాయక్, ఆనంద్‌నాయక్, రవి, శంకర్‌నాయక్, కమల్‌నాయక్, సేవ్యానాయక్, రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.



పరిగి సబ్ జైలులో ఖైదీలతో మాట్లాడుతున్న వికారాబాద్ జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శీతల్

## సత్ప్రవర్తనతో మెలగాలి

### వికారాబాద్ జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శీతల్

కులకచర్ల/పరిగి, నవంబర్ 25 : క్షణికావేశంలో చేసిన తప్పులతో మీరే కాకుండా మీ కుటుంబసభ్యులు కూడా ఇబ్బందిపడుతారని వికారాబాద్ జిల్లా సీనియర్ సివిల్ జడ్జి(సెక్రటరీ, జిల్లా న్యాయ సంస్థ) శ్రీతల్ అన్నారు. సోమవారం పరిగి సబ్ జైల్‌లో ఖైదీల రోజువారీ దినచర్య, వసతుల గురించి జైలు సూపరింటెండెంట్ రాజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులతో కుటుంబ సభ్యులందరూ ఇబ్బందిపడుతారని, మొదటి సారి చేసిన తప్పులు మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత సత్ప్రవర్తనతో సమాజంలో మెలగాలన్నారు. ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచితంగా డిఫెన్స్ లాయర్‌ను ఏర్పాటు చేయడం, బెయిల్ మంజూరు చేయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో లీగల్ డిఫెన్స్ లాయర్లు రాము, వెంటేశ్, శ్రీనివాస్, గౌడ్‌పాషా, జైలు సిబ్బంది విశ్వనాథరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా

## ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందించాలి

పేద, మధ్యతరగతి వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సోమవారం ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో రంగారెడ్డి, వికారాబాద్ కలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్లకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ ఉమ్మడి జిల్లాల నాయకులు మాట్లాడుతూ.. విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు కల్పించాలన్న డిమాండ్లతో ధర్నా చేపట్టామన్నారు. ప్రతి బిడ్డకు నాణ్యమైన ఉచిత విద్య అందించాలని, కేజీ నుంచి పీజీ వరకు ఏడాదికి రూ.లక్ష ఇవ్వాలన్నారు. ప్రజల అర్హతను బట్టి ఉపాధి కల్పించడంతోపా టు విద్యకు 25%, వైద్యానికి 25% నిధులు కేటాయించాలన్నారు. ధర్నాలో రాష్ట్ర కార్యదర్శులు అబ్దుల్‌రెహ్మాన్, రాఘవేంద్ర, రాష్ట్ర నాయకు లు రవీందర్, జిల్లా కన్వీనర్లు రాకేశ్, అమరేందర్, రమేశ్, నర్సిరెడ్డి, శేఖర్, భాస్కర్, మల్లికార్జున్, వెంకటేశ్, వెంకటేశ్, శేఖర్, శివకుమార్, బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు, పాల్గొన్నారు. –ఆదిబట్ల/వికారాబాద్, నవంబర్ 25



వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట..



## దుకాణ సముదాయ షట్టర్లకు డ్రా..

మండల కేంద్రంలోని పాల శీతలీకరణ కేంద్రం ఆవరణలో తెలంగాణ పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య ఆధ్వర్యంలో నిర్మించిన దుకాణ సముదాయంలోని 10 షట్టర్లకు సోమవారం కందుకూరు ఆర్డీవో కార్యాలయంలో డ్రా నిర్వహించారు. ఈ షాపుల కోసం 70 మంది పోటీపడ్డారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆధ్వర్యంలో షాపుల వారీగా పది దుకాణాలకు అత్యధికంగా కోట్ చేసిన వారి పేర్లను ప్రకటించారు. షట్టర్ నంబర్–1 అక్షయ, 2–చరణ్‌తేజ్, 3–జగదీశ్‌గౌడ్, 4–మహ్మద్ షకీల్, 5–కోశిక ఉపేందర్, 6–గంప వెంకటేశ్, 7–శ్రీలత, 8–మూడ రవికుమార్, 9–శివుడు. 10వ నంబర్ షట్టర్ రమేశ్ దక్కించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్, కందుకూరు తహసీల్దార్ గోపాల్, ఎంసీసీ మేనేజర్ రాధిక, అడిట్ అధికారులు పాల్గొన్నారు. –కడ్తాల్, నవంబర్ 25